# వీరయ్య వీర మరణం

కొన్ని కాలంలో పుట్టి గణన కెక్కలేదుగాని, వీరయ్య పురాణ యుగంలోను, చరిత్రలోనూ పేరు ప్రఖ్యాతులు గడించుకున్న మహావీరుల తరహాలో చెప్పవలసినవాడు. రాక్షసుల చెరలో చిక్కి రక్షించవలసిన రాజకుమార్తెలు లేని ఈ కాలంలో, సమర రంగంలోకి సింహంలాగ దూకి, సైన్యాలను తన కరవాలానికి బలిచేసి ఒక అసహాయసూరుడు విజయలక్ష్మిని వరించడానికి వీల్లేని ఈ కాలంలో. వ్యక్తి ధైర్యసాహసాలూ, వ్యక్తి ఔదార్యం, వ్యక్తి గౌరవం, సమూహమనే సముద్రంలో సమసిపోయిన ఈ కాలంలో నిజంగా వీరయ్య తప్పపుట్టాడు. అసలు వీరస్వర్గమనేది ఒకటుంటే, అతను మరణానంతరం అక్కడికే పోయాడనడానికి ఏమీ సందేహం లేదు. బ్రతికిన నాలుగు రోజులూ తన ప్రత్యేకతను నిరూపించుకున్నాడు. రాజులా బ్రతికాడు. రాజులా చచ్చిపోయాడు.

వీరయ్య ఆ ఊళ్లో బస్సు డ్రైవరు. అతని చేతిలో బస్సు పక్షిలా ఎగిరేది. అంటే నేలమీద తక్కువ, గాలిలో ఎక్కువ ప్రయాణం చేసేదన్నమాట. రోడ్డు కడ్డంగా బరితెగించిన కుక్కపిల్లలు. కోడిపెట్టలు స్వరక్షణ విషయంలో చాకచక్యముంటే తప్పించుకోగలిగేవి, లేకపోతే వాటిని గురించి వీరయ్య ఎన్నడూ విచారపడలేదు. బ్రతకడానికి తాహతు ఉన్నవారికే ప్రపంచకంలో స్థానం ఉందని అతని సిద్ధాంతం. సృష్టి పరిణామంలో అన్నిటికంటే పై మెట్టున ఉన్నారు గనుక, మనుషులు మట్టుకు మైలు దూరంలో వీరయ్య కారు చూడగానే జాగ్రత్తపడేవారు, అంచేత అతని డ్రైవరు హయాంలో చెప్పుకోదగ్గ ప్రమాదాలేవీ జరగలేదు.

అయితే సమాజంలో ప్రతి మనిషి తెలిసో, తెలియకో, భయంవల్లో భక్తివల్లో, కొన్ని నియమాలకి కట్టుబడతాడు. కొన్ని సంప్రదాయాలను, ఆచారాలను మన్నిస్తాడు. వీటిలో కొన్ని అనాదినుంచి అనుశ్రుతంగా వచ్చినవి; కొన్ని అప్పటికప్పటికి అమలులో కొచ్చినవి; కొన్ని న్యాయ శాస్త్రంలోనూ; చట్టాలలోనూ కట్టుదిట్టం చెయ్యబడ్డవి, కొన్ని లిఖిత పూర్వకంగా లేకపోయినా ప్రజలందరూ ఆమోదించి ఆచరించేవి. ఈ తరహాకి చెందిన ఆచారాల్లో ఒకటి, బస్సులో ముందర సీటు పెద్ద ఉద్యోగస్థులికి కేటాయించడం. వీరయ్యకు ఈ ఆచారంతో వచ్చింది పేచీ. అతను నడుపుతున్న బస్సులో ఈ ఆచారాన్ని అమలు జరపడానికీ అతను ఒప్పుకోలేదు. అతను పెట్టుకున్న నియమం. ముందు వచ్చి కూర్చున్నవాడిదే ముందు సీటు. ఊరి పెద్దలకి దీనివల్ల ఎంత కోపమొచ్చినా వీరయ్యని వారేమీ చెయ్యలేకపోయారు.

కారణం అతను ఆరడుగుల మనిషి. విశాలమైన ఛాతీ, కండలు తిరిగిన జబ్బలు. మణికట్టుమీద తోలుపటకా. బొద్దు మీసాలు, పెద్ద కళ్లు, వాటిలో ఎర్రటి జీరలు. అన్నిటికంటే ఏ అధికారాన్నీ గౌరవించని అతని పొగరు.

కొత్తగా బదిలీ అయి వచ్చిన పోలీసు ఇన్‌స్పెక్టరుగారొకనాడు కోర్టు పనిమీద వెడుతూ వీరయ్య బస్సెక్కారు. సంగతి తెలిసిన పోలీసులు కొంచెం దూరంగా ఏమీ

ఎరగనట్టు నిలబడితే ఇన్‌స్పెక్టరుగారే స్వయంగా ముందు సీటులో కూర్చున్న ఒక ఆసామీని దిగమన్నారు. ఆ ఆసామీ బెదురుతో దిగాడు. వీరయ్య కారులోంచి దిగాడు. ఇన్‌స్పెక్టరుగారిని దిగమన్నాడు. ఇన్‌స్పెక్టరుగారు సృష్టి తలక్రిందులయిపోయినట్టు ఆశ్చర్యం, ఆగ్రహం నటించారు. వీరయ్యకి వాదాలతో పనిలేదు. ఎడంచేత్తో గాలిపటాన్ని ఎత్తినట్టు, ఇన్‌స్పెక్టరుగారి నెత్తి కింద పెట్టాడు. ఒద్దు ఒద్దంటున్నా, దిగిపోయిన ఆసామీని ముందు సీట్లో కూచోబెట్టాడు. విధిలేక అవమానాన్ని దిగమింగి, ఇన్‌స్పెక్టరుగారు వెనకసీట్లో కూర్చున్నారు.

దురదృష్టవశాత్తూ దారిలో ఒక సంఘటన జరిగింది. కారు నిండుగా ఉంది. ఒక ఊరి దగ్గర ఒక కుర్రవాడు తన తల్లికి జబ్బుగా వుందనీ పట్నంపోయి వెంటనే డాక్టర్ని పిలుచుకురాకపోతే ప్రమాదమనీ వీరయ్యని బ్రతిమాలుకున్నాడు. ఆ కుర్రవాణ్ణి వీరయ్య కారులో ఎక్కించాడు. పట్నంలో పోలీసుస్టేషను దగ్గర బస్సు ఆగ్గానే ఇన్‌స్పెక్టరుగారు ఎక్కువమంది నెక్కించినందుకు కేసు బనాయించారు. పోవలసిన వేగంకంటే ఎక్కువ వేగంగా తోలినందుకు వీరయ్య డ్రైవరు లైసెన్సు రద్దు చేయించారు. కారు యజమాని ఎక్కువమందిని ఎక్కించినందుకు బాధ్యత తనది కాదన్నాడు. ఫలితం వీరయ్యకి ఉద్యోగం పోయింది. వంద రూపాయలు జరిమానా పడింది. జరిమానా ఇవ్వని కారణంచేత మూడునెల్లు ఖైదు విధించారు.

ఊళ్లో పెద్దలందరూ ఇన్‌స్పెక్టరుగారి చాకచక్యానికి ఆయన్ని అభినందించారు. ఒక్కసారి నిశ్చింతగా ఊపిరి పీల్చుకున్నారు. అందులో ముఖ్యుడు ఆ ఊరి మునసబు కనకయ్య.

కనకయ్య పెద్ద కామందు. గ్రామ మునసబయినా కలెక్టరు మొదలు మంత్రుల వరకూ అందర్నీ పట్టుకోగల పలుకుబడి ఉంది ఆయనకి. రంగాలు కూతురు రత్తి విషయమయి కనకయ్యగారికీ, వీరయ్యకీ పట్టింపులొచ్చాయని ప్రతీతి. రంగాలు కనకయ్య గారింట్లో దాసీపని చేస్తున్న కారణంచేత, రత్తి మీద ఆయనకు హక్కుండడం సహజమైనా, రత్తి తల్లిదగ్గరనుంచి లేచివచ్చి వీరయ్యతో కాపరం పెట్టింది. ఊరి బయట ఒక గుడిసెలో.

రత్తి మంచి రంగయిన పిల్ల. ఆడదయి పుట్టిందిగాని, అసలు వీరయ్యతోబాటు అసహాయశూరుల్లో చేర్చవలసిన వ్యక్తి. ఈ సృష్టిలోకల్లా వీరయ్యని ఎదిరించి మాట్లాడ గలిగినది ఒక్క రత్తే. అనేక పర్యాయాలు అతనితో చేతులు కలిపి ఓడిపోయానని పించుకోకుండా బయటపడింది. మాటల్లో మట్టుకు రత్తిదే పై చెయ్యి. అంచేత వీరయ్య ఆమె ఆధిక్యాన్ని అంగీకరించాడు. వీరయ్యకి రత్తంటే అనురాగమే కాక, అనుమానంతో కూడిన భయంలాంటిది ఏదో ఉంది. రత్తికి వీరయ్య రాజు.

వీరయ్య జైలుకి వెళ్లడానికి కనకయ్య ప్రోత్సాహం చాలా ఉందని ఊళ్ళో ఒక ప్రచారం ఉంది. రత్తికీ వీరయ్యకీ మట్టుకు ఈ పని కనకయ్యే చేయించాడని రూఢి.

వీరయ్యని జైల్లో పెట్టిం తరవాత, కనకయ్య రంగాలు చేత రత్తికి కబురు చేశాడు. వచ్చి తల్లి దగ్గర ఉండమని, రత్తి రాను పొమ్మంది.

ఉన్నట్టుండి ఊళ్లో ఒక పుకారు బయలుదేరింది. వీరయ్య జైల్లోంచి పారిపోయి వచ్చేశాడని. కనకయ్య గుండెల్లో రాయి పడింది. అతను ఇంట్లోంచి బయటికి అడుగు పెట్టడం మానేశాడు. ఇన్‌స్పెక్టరుగారూ, అతనూ కలిసి ఎన్నో రకాలుగా ఆలోచించారు.

వీరయ్యని మళ్ళీ పట్టుకోడానికి పద్ధతులు చర్చించారు. రెండు ఇళ్ళ చుట్టూ ప్రతి రాత్రీ పోలీసు బలగం కాపలా పెట్టుకున్నారు. ఎక్కడెక్కడ ఉంటాడని తోస్తే అక్కడక్కడ వెతికించారు. వీరయ్య ఆచూకి అంతు పట్టలేదు. రత్తిని పట్టుకుని బలవంతం చేశారు. కొంత హింస పెట్టారనికూడా లోకులనుకుంటారుగాని, ఆ నిజానిజాలు కనకయ్యకీ, ఇన్‌స్పెక్టరు గారికే తెలుసు. ఏమయినా రత్తి తనకేమీ తెలియదదంది. ఊరంతా అట్టుడికి నట్టుడికి పోయింది. రాత్రులు కొందరు వీరయ్యని ఊరి వీధుల్లో చూశామని అంటూ వచ్చారు. అయినా వీరయ్య దొరకలేదు. ఎవరికో కనిపించి కనకయ్యని నరికేస్తానన్నాడని ఎవరో ఎవరికో చెప్పినట్టు గాలి కబురు. పోలీసులు ఊరంతా గాలిస్తున్నారు. ఎక్కడో వీరయ్య కనిపించాడనగానే ఊరంతా అక్కడికి పరుగెత్తేవారు. రకరకాల కథలు ప్రచారంలోకొచ్చాయి. కొందరు కవితా ప్రతిభగలవారు చిత్రవిచిత్రమయిన కతలు కల్పించి, అవి జరిగినట్టూ, తాము చూచినట్టూ వర్ణించారనికూడా ఒక వాదం లేకపోలేదు. కాని, రోజు రోజూ కొత్త కథలు వర్ణించారని కూడా ఒక వాదం లేకపోలేదు. కాని, రోజు రోజూ కొత్తకథలు ప్రచారంలోకొస్తున్నాయి. ఒక రాత్రంతా వీరయ్య పోలీసుస్టేషనులో ఇన్‌స్పెక్టరుగారి కుర్చీలోనే నిద్రపోయాడనీ, పోలీసులు అతని దగ్గరకు పోడానికి భయపడి స్టేషను విడిచి పారిపోయారనీ – ఇంకో రాత్రి వీరయ్య సందులో కొట్టు దగ్గర సోడా తాగి బీడీ కాల్చుకుంటూ కూర్చుండగా హెడ్‌కానిస్టేబుల్ యధాలాపంగా అక్కడికొచ్చి వీరయ్యని చూసి అమాంతంగా మూర్ఛపోయాడనీ, ఇలాంటివెన్నో అతిఉత్సాహంగా అందరూ చెప్పుకుంటున్నారు. ఈ కథలన్నీ విన్న కానిస్టేబుల్సందరికీ గుండెలు పీచుపీచు మంటున్నాయి.

ఈ గందరగోళంలో కర్తవ్యం ఆలోచించడానికి కనకయ్య ఇన్‌స్పెక్టరుగారింటికి వెళ్ళాడు. ఇద్దరూ కలిసి ఒక తీర్మానానికొచ్చారు. రత్తిని రహస్యంగా పిలిపించారు. ముందు వీరయ్య కే అపాయం రాదని మాటిచ్చారు. ఇలా రహస్యంగా అతడు అట్టే రోజులుండలేడనీ, అవసరమయితే తుపాకీ బలగాన్ని తెప్పించి కుక్కని కాల్చినట్టు కాల్పించేస్తామనీ బెదిరించారు. అతను గనక దొరికిపోతే ఒక్క జైల్లోంచి పారిపోయి వచ్చిన నేరానికి మాత్రం నాలుగయిదు మాసాలు శిక్షవేస్తారనీ, తరువాత బతికున్నన్నాళ్ళూ అతను స్వేచ్ఛగా బతకొచ్చుననీ నచ్చచెప్పారు. రత్తి తనకేమీ తెలియదదంది. అసలు తనింటికతను రాలేదంది. అయినా, ఎక్కడన్నా అతని ఆచూకీ తనకి తెలిస్తే ఈ సంగతి అతనికి చెప్పి అతనేమంటాడో వొచ్చి కనకయ్యతో చెపుతానంది. దానిమీద కనకయ్య ఒకవేళ రత్తే అతన్ని పట్టిచ్చినా అతనికే అపాయం రానివ్వమని హామీ ఇచ్చాడు. రత్తి తనకసలు అతనున్న జాడ తెలియదని చెప్పి వెళ్ళిపోయింది. వీరయ్య ఆచూకీ ఆమెకు తెలుసునని ఇన్‌స్పెక్టరు నిర్ధారణ చేసుకున్నాడు. పై ఊరినించి రహస్యభటుల్ని తెప్పించి ఆమె రాకపోకలు పరిశీలించడం ప్రారంభించారు.

ఒకనాటి రాత్రి స్మశానం అవతల తుమ్మలానులో గడ్డిమేట పక్కని రత్తి వీరయ్యని కలుసుకుంది. కనకయ్యా, ఇన్‌స్పెక్టరూ చెప్పినవన్నీ చెప్పింది. దొరికిపొమ్మని బతిమాలింది. వీరయ్య ససేమిరా అన్నాడు. కనకయ్యని చంపేసి, ఇన్‌స్పెక్టరు కాలో–చెయ్యో తీసేసి తనెక్కడకన్నా పారిపోతానని పట్టుపట్టి కూర్చున్నాడు. రత్తి ఎంతో వాదించింది. తనకోసమన్నా దొరికిపొమ్మంది. వీరయ్య ఎన్నటికీ అటువంటి పిరికిపని చెయ్యనని

సమాధానం ఇచ్చాడు. ఇంతలో గడ్డిమేటి మీద చప్పుడయింది. వీరయ్య చటుక్కుని లేచాడు. రత్తి తన ఆచూకీ శత్రువుల కిచ్చేసిందని అనుమానపడ్డాడు వీరయ్య. ఆమెను దూషించాడు. రత్తి తనే పాపం ఎరగనంది. అతనిమీద ఒట్టుపెట్టుకుంది. కాని, అంతలోనే చాలామంది చీకట్లో చుట్టుముట్టుతున్నట్టు అలికిడయింది. వీరయ్య జాగ్రత్తగా వింటున్నాడు. చటుక్కుని ఒక బ్యాటరీ లైటు వెలిగింది. వీరయ్య గురిచూసి బాకు విసిరాడు. లైటు ఆరిపోయింది. కెవ్వుమని కేక. ఆ తరువాత గందరగోళం. తుపాకులు పేలాయి. పోలీసులు చివరికి ఆ చీకట్లో వీరయ్య మోసగించి పారిపోయాడని తెలుసుకున్నారు. ఒకళ్ళనొకళ్ళు నిందించుకున్నారు.

కనకయ్య ఇంట్లోంచి ఆర్తనాదాలు ఇరుగుపొరుగునీ లేపాయి. జనం చేరారు. పోలీసులు తుపాకులు తీశారు. ఇంటి తలుపు పగలగొట్టి లోపలికి వెళ్లారు. ఒక మూల ఆడవాళ్లు, పిల్లలూ గోలపెడుతూ నక్కి కూర్చున్నారు. కనకయ్య గదిలోంచి అరుస్తున్నాడు. గది తలుపు బలమంతా ఉపయోగించి తెరవడానికి వీరయ్య ప్రయత్నిస్తున్నాడు. కొంచెం ఉంటే తలుపు తెరుచుకునేదే. కాని జనం వొచ్చేశారు. వీరయ్య మండువాలో నుంచి ఇంటిమీదికి ఎక్కేశాడు. పోలీసులూ, జనం బయటికి పరుగెత్తారు. మదురుగోడమీద నడుస్తూ కనిపించాడు వీరయ్య. పోలీసులు తుపాకులు కాల్చారు. వీరయ్య నూతిమీద అడ్డంగా ఉన్న గోడమీదికి పాకి పడుకున్నాడు. చీకట్లో వీరయ్య జాడ ఎవరికి తెలియలేదు. సాహసించి ఎవరూ అంత దగ్గరగా రాలేకపోయారు. దీపాలకోసం కొందరు పోయారు. పోలీసులు ఏం చెయ్యడానికి తోచక తుపాకులు దించారు. వీరయ్య మెల్లగా లేచాడు. జనం వెంటనే అడుగో అంటే అడుగో అన్నారు. కాని, ఆలోగా పాతబడిన ఆ గోడ వీరయ్య బరువుకి లొంగిపోయింది. అమాంతంగా నూతిలోకి కూలిపోయింది.

అప్పుడు ధైర్యంగా ముందుకొచ్చాడు ఇన్‌స్పెక్టరుగారు. నూతిలోకి దీపాలువేసి చూశారు. అస్పష్టంగా ఒక మూర్తి నూతికడ్డంగా శేషపాన్పు నారాయణమూర్తి పవ్వళించినట్టు ఉందని కొందరన్నారు. పైకి రమ్మని ఇన్‌స్పెక్టరుగారు అధికార పూర్వకంగా ఆదేశించారు. లోపలినించి సమాధానం లేదు. ఇన్‌స్పెక్టరుగారు పొడుగాటి గెడలతో పొడవమని ఆజ్ఞాపించారు. ఒక పోలీసు గెడ పుచ్చుకొని లోపలికి పొడిచాడు. ఏమయిందో తెలియదు పోలీసు పొలికేక పెట్టి పది గజాలు ఇవతలికి దూకాడు. చుట్టూ మూగిన జనం ఒకళ్ల నొకళ్లు తొక్కుకుంటూ స్వరక్షణార్థం నూతి దగ్గరనుంచి పారిపోయారు. క్రింద పడిపోయిన ఇన్‌స్పెక్టరుగారు నూతిలోకి తుపాకులు కాల్చమని ఆజ్ఞాపించారు. ఇంతలో తుఫానులా వొచ్చి పడింది రత్తి. నూతి దగ్గరకు పోయి వెర్రిగా జాలిగా పోలీసుల్ని తుపాకులు కాల్చొద్దని బతిమాలింది. దొరికితే ఏ అపాయం రానివ్వనని ఇన్‌స్పెక్టరుగారు అన్నమాట నిలబెట్టుకోమంది. కాని చట్టం దానిపని చెయ్యక తప్పదు. రత్తి పోలీసుల తుపాకులు పట్టుకుని గింజులాడింది. కాని, కొన్ని తుపాకులు నూతిలోకి పేలాయి. ఆ కీచులాటలో రత్తి పట్టుతప్పి నూతిలో పడిపోయింది. ఒక తుపాకీ దెబ్బ ఆమె తలకు తగిలిందని అంటారు.

ఆ విధంగా అంతమయింది వీరయ్య వీరగాథ.

**(అన్వేషణ - త్రైమాసిక - 1961)**